# తెల్లవారిన రాత్రి

బారులుతీర్చిన పాలదీపాల తెలివెలుగులో సికిందరాబాద్ స్టేషను పెళ్ళిపందిరిలా వెలిగిపోతోంది. హడావుడిగా ప్లాట్‌ఫారం మీద అడుగు పెట్టాను. రైలు బయలుదేరే సూచనగా ప్లాట్‌ఫారం చివర పచ్చదీపం కాంతిని విరజిమ్ముతోంది. హౌరా ఎక్స్‌ప్రెస్ బయలుదేరటానికి ఇంకా మూడు నిమిషాల వ్యవధివుంది. త్వరితంగా అడుగులువేసుకుంటూ 'స్లీపర్' వద్దకు వెళ్ళాను. తలుపు ప్రక్కన అంటించిన నోటిసు మీద నాపేరు కోసం వెదికాను. ఇరవై ఏడవ నెంబరు సీటు నాది!

భుజానికున్న ఎయిర్ బేగ్ సర్దుకుంటూ కంపార్టుమెంటులోనికి వెళ్ళి నాసీటుకోసం వెతుకుతూ ముందు

నడిచాను. నా అదృష్టం కొద్దీ అది కిటికీ ప్రక్కసీటే! మిగిలిన రెండుసీట్లలోనూ ఆడవాళ్ళెవరో వున్నారు.

ఎయిర్ బేగ్ సీటుమీద వుంచి ప్రక్కకుచూశాను. నాప్రక్కసీటులోని ఆమె చదువుతున్న పుస్తకంలోంచి తల ఎత్తింది!

ఉలిక్కిపడ్డాను! ఆమె-

ఆమె రజని! ఏనాటి దీ రజని?!

సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం-

అమరేశ్వరునికోవెల ప్రాంగణాన, జిలిబిలి కెరటాలతో సొగసు వీనుతూ, 'వయ్యారాలు పోతున్న కృష్ణవేణమ్మ ఒడ్డున, నా ఒడిలో తలవాల్చి గారాలుపోయిన రజని!

"కృష్ణా! ఈనిమిషాలు ఇలా శాశ్వతం చేసుకోనీయ్! నాతనువు, మనసు, కలలు అన్నీ నీ కోసమే' అని కలవరించిన రజని!

మళ్ళీ ఎనిమిది సంవత్సరాల తరువాత ఆమె ప్రక్కసీట్లో కూర్చొని వాల్తేరు వెళ్ళాల్సి వస్తుందని ఏ నాడు ఊహించలేదు!

రైలు చిన్నగా కూతపెట్టి చిన్నకుదుపుతో ముందుకు కదిలింది.

"రజనీ!" అన్నాను ఉద్వేగంగా.

రజని నావంక ఒక్క నిమిషం తేరిపార చూసింది.

తరువాత విస్మయంగా "నువ్వా!"- అంది.

"నేనే రజనీ! కృష్ణని! ఏం అంతగుర్తు పట్టలేనంతగా మారిపోయానా?" నిష్ఠూరంగా అన్నాను. కాని ఆ మాటలు నాకే రుచించలేదు.

ఈ ఎనిమిదేళ్ళలోనూ నేను బాగా పొడుగు పెరిగాను. జీవితంలోని ఉత్సాహం, ఆవేశం చల్లారిపోవటం వలన చిక్కిపోయానేమో కూడా! నేను బాగా మారిపోయానన్న సత్యం నాకు తెలుసును!

"అవును! మారిపోయావు" పొడిగా అంది.

ఆ మాటలు అంటున్నపుడు ఆమె ముఖంలో ఎలాటి భావమూ వ్యక్తం చేయలేదు.

"అలా నిలబడిపోయావేం! కూర్చో!" అంటూ నా ఎయిర్ బాగ్ ప్రక్కకు సర్దింది. కూర్చొని జేబులోని రుమాలుతీసి ముఖానికున్న చెమటను తుడుచుకుంటూ ఆమె వైపు చూశాను. నెమలి కంఠం రంగు పట్టుచీరలో దివి నుంచి దిగివచ్చిన దేవకన్యలా మెరిసి పోతోంది రజని! మును పటికంటె మరింత వళ్ళు చేసి పుష్టిగా కనబడుతోంది. మెడలో వదులుగావున్న ముత్యాల హారాన్ని ముడివేసి సుతారంగా గుండెల మీదకు వదిలేసింది. చెవులకున్న ముత్యాల దుద్దులు దీపకాంతిలో తళుక్కు మంటున్నాయి. అనుభవం వదిలిన సీలిసీడల్లా కనురెప్పల క్రింద మాత్రం రెండు నల్లనిగీతలు సన్నగా కనుపిస్తున్నాయి. మాట్లాడి నపుడు గొంతులో అదే జీర, వగరు చిగుళ్ళు తిన్నకోయిల

గొంతులో పలికే వంపులకు మల్లే! ఒక చేతికి బంగారపు గొలుసుతో స్కేర్ వాచీ, రెండో చేతికి నిండా బంగారు గాజులు, సుమారు పదికి పైగానే వుంటాయి! చేతులు కదిలించినపుడల్లా ఆమె ఐశ్వర్యాన్ని సన్నని సంగీత రూపంలో ప్రకటిస్తున్నాయి. బహుశః ఎవరో ధనికుణ్ణే పెళ్ళాడి వుండాలి.

మళ్ళీ ఇన్నాళ్ళ తరువాత-కాదు, ఇన్నేళ్ళ తరువాత రజనిని కలుసుకున్నందులకు నాకు ఎంతో ఆనందంగా వుంది. ఎన్నో విషయాలు రజనితో మాట్లాడాలని తహతహగా వుంది. కాని నాలుగయిదు నిమిషాల వరకూ ఏం మాట్లాడాలో తెలియక మూగవాడిగానే వుండిపోయాను. రైలు వేగం పుంజుకొని పరుగుతీస్తోంది.

చల్లనిగాలి కిటికీలోంచి రివ్వునవీచి శరీరానికి పులకింతలు కలుగ జేస్తోంది. ఎదుటి సీటులో కూర్చున్న ముగ్గురూ ఉత్సాహంలో మాట్లాడుకుంటూ పగలబడి నవ్వుకుంటున్నారు.

రజని తాను చదువుతున్న పుస్తకం మూసేసి ప్రక్కన పడేసింది. నుదుటిమీదపడి అల్లరి చేస్తున్న ముంగురులను సర్దుకుంటూ అంది "కృష్ణా! ఇప్పుడు ఎక్కడుంటున్నావ్?"

"విశాఖపట్నంలో-" తడుముకోకుండా అన్నాను.

"ఏం చేస్తున్నావ్?"

"ఆ! — ఏమిటంటున్నావు?" కాస్త తడబాటుతో అడిగేను.

"విశాఖపట్నంలో ఏం చేస్తున్నావ్?"

"రావ్ అండ్ కంపెనీలో ఆఫీసు మేనేజరుగా పని చేస్తున్నా!" మాటలు ఆపి నా బట్టలవంక చూసుకున్నాను. నేను వేసుకున్న టెరీకాట్ పేంటు పదిరోజులు మాసినదే అయినా, రంగులో కలిసిపోయి మాపు కనబడటంలేదు. ఆ దినమే ఉతికి వేసుకున్న టెర్లిన్ చొక్కా మాత్రం మెరుస్తూనేవుంది.

"ఏ మాత్రం 'డ్రా' చేస్తున్నావ్?"

పిడుగు పడింది! ఏ ప్రశ్న ఆమె అడగ కూడదని ఆశిస్తున్నానో అదే అడిగింది. కాకపోతే-'ఎంతిస్తారేమిటి?' అని అడగకుండా కాస్త నాగరికంగా అడిగింది! అంతే!

సమాధానం కోసం కొంతసేపు తడుముకుంటూ "మొగాళ్ళ జీతం అడక్కూడదు!" అన్నాను చిన్నగా నవ్వుతూ.

రజని నావైపుకు వంగింది. ఏదో రహస్యం చెప్పబోతున్నదానికి మల్లే ఆమె వంటికి రాసుకున్న ఖరీదయిన 'ఉడుకులాం' వాసన ఒకసారి నన్నుచుట్టు ముట్టింది.

"ఎనిమిదేళ్ళ క్రితం మనం ఆఖరుసారిగా కల్సుకున్న సాయంత్రం నువ్వు నన్ను అడిగిన ప్రశ్న గుర్తుందా?-నా వయస్సు వెంటనే చెప్పాను. నేను నీకంటె ఆరునెలలు పెద్ద

దాన్ని! ఆ వయస్సే సాకుగా పెద్దలు మన పెళ్ళికి ఒప్పు కోటం లేదనిచెప్పి నన్ను మభ్యపెట్టావు. ఈనాడు నేను నీ జీతం అడగకూడదూ?" మెల్లగా అంది.

నాకు ఊపిరి ఆడటం లేదు!

రజని మాట్లాడుతున్న విధానానికి తట్టుకోటం కష్టంగా వుంది.

జేబులోనుంచి సిగరెట్టు తీసిముట్టిస్తూ "పదిహేను వందలు" అన్నాను.

"అప్పుడు నీకీ అలవాటు వుండేదికాదు।" అందిరజని.

నేను అబద్ధం ఆడుతున్నట్లు రజని పోల్చిందా?

సిగరెట్టు గట్టిగా పీల్చి "ఏ అలవాటు?" అన్నాను

"అదే। సిగరెట్లు కాల్చటం-ఆరోగ్యానికి అంత మంచిది కాదు, మానెయ్యకూడదూ?" మెత్తగా శాసిస్తున్న ధోరణిలో అంది.

జీవితంలో ఒక్కసారి ప్రేమించిన ఆడది జీవితాంతం శాసించగలదు కాబోలు।

"సిగరెట్టు కాల్చటంలాటి దురలవాటు వుండటమే మంచిది"

"ఏం? ఎందుకని?" అందిరజని.

"మిగిలిన వాళ్ళతో పోల్చుకొని మనకున్న దురలవాటు చాలా చిన్నదే అని సంతృప్తి పడటానికి" సిగరెట్టు దుమ్ము చిటికవేసి దులుపుతూ అన్నాను.

నా సమాధానానికి రజని నవ్వింది! వీణ తీగల్ని బలంగా లాగివదిలేస్తే దూరానికి వినబడే ప్రతిధ్వనిలా!

ఆ నవ్వు పాతదే!-ఎనిమిదేళ్ళ పాతది!

నవ్వినపుడు పై పెదవి చిత్రంగా పైకిలేచి రెండు తెల్లని ముత్యాల్లాటి పండ్ల మధ్య కెంపులా ఎర్రని ఇగురు తళుక్కు మంటుంది, తెల్లని మేఘ శకలాల మధ్య పగిలిన సూర్యబింబంలా।

"నువ్వు చేసేపని తప్పని తెలిసినా సమర్థించుకునే అలవాటు నీకింకా పూర్తిగాపోలేదు. సిగరెట్టు కాల్చటం దురలవాటని ఒప్పుకున్నావు అంతేచాలు।" అందినవ్వుఆపి.

"మీ ఆయన సిగరెట్టు కాల్చడా?" కసిగా అడిగేను. ఎందుకో నాకు తెలియకుండానే రజని భర్త మీద ఎప్పటినుండో 'ప్రెజుడిస్' వుంది. అదిఎలా ఏర్పడిందో నాకే తెలియదు.

బహుశః రజనికి కూడా నాభార్య మీద అలాటి అసూయే వుండి వుండాలి.

"ఊహు। సిగరెట్టుకాల్చరు, కాఫీత్రాగరు, కనీసం వక్కకూడా వేసుకోరు. ఆయనను నువ్వు చూడలేదుకదూ! నీపెళ్ళికి వద్దామనుకున్నాను, కాని నువ్వు పిలవలేదు! నా పెళ్ళికి పిల్చాను, కాని నువ్వురాలేదు।"

నేనేం సమాధానం చెప్పలేదు!

మనసు ఖాళీ అయిపోయినట్లనిపించింది.

అవును! రజనిని నా పెళ్ళికి పిలవలేదు! మరచి పోయిలేదు, మొహం చెల్లక!!

"మా ఆయన ఎంత బావుంటారో తెలుసా?" మాటలు ఆపి మూతి సున్నాలా బిగించి నావంకే చూస్తోంది రజని! నా ముఖంలోని భావాలను పసిగట్టడానికి కాబోలు! ఆడదాని మనసుకన్న 'అయిన్‌స్టీన్' సిద్ధాంతం తేలికగా అర్థమవుతుందను కుంటాను.

రజని ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేదు. బొగ్గు పడుతోందని అద్దం కొంచెం దింపేను.

"మీ ఆవిడ బాగుంటుందా?" మళ్ళీ ఆమే అడిగింది. నేను సమాధానం చెప్పేలోగానే "ఇరవై వేలు కట్నం తెచ్చిన భార్య బాగుండక నాపరాయిలా వుంటుం దేమిటి?" అంటూ నవ్వింది.

మాటలతో ప్రతిసారీ రజనిదే పై చేయి అవుతోంది నేను ఓడిపోతున్న అనుభూతికల్గుతోంది.

"మీ ఆయన ఏ మాత్రం కట్నం తీసుకున్నా డేమిటి?"

ఇక నేను ఊరుకో దల్చుకోలేను.

"కట్నం ఇచ్చుకో గలిగితే నిన్నే చేసుకొని వుండే వాణ్నిగా! అప్పుడు నేను నీ కంటె ముప్ఫయ్యేళ్ళు పెద్ద వాణ్నయినా నీకు అభ్యంతరం వుండేది కాదు, ఏ మంటావ్?"

"రజనీ!......" అసహనంగా అరిచేను. "ఎందుకంత ఆడిపోసుకుంటావ్? ఎనిమిదేళ్ల క్రితం జరిగిన సంగతులన్నీ ఇప్పుడు తవ్వి తల కెత్తుకుంటే నీకేం కల్సివస్తుంది."

రజని మాట్లాడలేదు.

మా ఇద్దరి ప్రవర్తనకూ మా ఎదుటి సీట్లోని ముగ్గురూ విచిత్రంగా చూస్తున్నారు.

"రజనీ! నువ్వు చాలా మారిపోయావు!" అన్నాను కొంత సేపు మాటలకోసం తడుముకొంటూ.

"పోనీలే, నువ్వు బాధపడుతున్నట్లున్నావ్! ఏమయినా కబుర్లుచెప్పు, వింటాను." అంది.

"దాహంగా వుంది, నీ దగ్గర మంచినీళ్ళువున్నాయా!" అన్నాను సిగరెట్టు కిటికీలోంచి అవతలపారేస్తూ.

"ఓ! ఫ్లాస్కులో 'అయిస్ వాటరు' వుంది ఇస్తా వుండు" అంటూ ముందుకువంగి ఎదుటిసీటు క్రిందనుండి పేముబుట్ట బయటకులాగి అందులోంచి ఫ్లాస్కుతీసింది. రజనిని పరిశీలనగా చూస్తూ కళ్ళు తిప్పుకోలేకపోయాను. ఆమె గుండెలమీదనుండి పుస్తెలు ముందుకు జారి గలగల మంటూ శబ్దం చేస్తున్నాయి.

ఫ్లాస్కు మూతలోకి సుతారంగా కొంచెం నీళ్లు వంపింది. కప్పును రెండువేళ్లతో కడిగి నీళ్లు అవతల వంపటానికి నా మీదుగా కిటికీ వైపుకు ఒంగింది. నాకు

ప్రాణాలు జివ్వు మంటున్నాయి. ఆమె ఒళ్లు నాకు తగి తే బాగుండును!

కప్పులో నీళ్లు ఒంపేసి "అబ్బ! బొగ్గుపడింది!" అంటూ కుడికన్ను బిగించి మూసుకుంది.

"ఉండు! నేను ఊదుతాను!" అంటూ చెంపల పైన చేయి ఆన్చి కన్ను బలవంతంగా విప్పి గట్టిగా ఊదాను.

రజని మెత్తని చెంపలు తగిలే సరికి నేనేదో వింత మనిషిన యినట్లు ఫీలయ్యాను.

"పోయిందిలే! అబ్బ! ఒక క్షణంలో ఎంతబాధ పెట్టింది!" అంటూ రుమాలతో కన్ను అద్దుకొని నాకు నీళ్లు అందించింది. నీళ్లు త్రాగుతూ వుంటే పళ్లుజివ్వుమని లాగుతున్నాయి. మెల్లగా చప్పరిస్తూ అన్నాను "కాజీ పేటలో భోజనం చేద్దాం, నాన్ విజిటేరియన్ తీసుకుం టావా?"

"ఒద్దు! నేను తినటం మానేశాను. మా ఆయనకు ఇష్టం వుండదు!"

"ఏమిటి! భోజనమా!"

"-కాదు! నాన్ విజిటేరియన్!"

"మీ ఆయనకు ఇష్టంలేనివి ఇంకేం మానేశావ్!"

"ఆయనకు ఇష్టంలేనివి చాలా మానేశాను!" నిశ్చ లంగా అంది రజని.

"అయితే మొత్తానికి బానిసలా బ్రతుకు తున్నా వన్నమాట!"

రజని నావంక ఆశ్చర్యంగా చూసింది!

"ఇందులో బానిసత్వం ఏముంది? జీవితాంతం తోడు నీడగా నిలిచే భర్తకోసం కొన్నిటిని త్యాగం చేయటంలో ఆనందంలేదూ! నాకోసం మా ఆయన ఎన్నో పద్ధతుల్ని మార్చుకున్నారు. అంతమాత్రాన ఆయన నాకుబానిసయ్యా రని అనమంటావా! అయినా, భార్యాభర్తల మధ్య హెచ్చు తగ్గులేమిటి!"

మాటల్లో మళ్ళీ రజనిదే గెలుపు! నా అహం ప్రజ్వ లిస్తోంది!

"అయితే నాన్ విజిటేరియన్ తీసుకోనంటావు!" అన్నాను.

"ఊహూ! తీసుకోను!"

"సరేలే! నీకు కావల్సినదే రప్పిస్తాను. ఈ రాత్రికి మాత్రం నువ్వు నా గెస్టువి!"

"తప్పకుండా!"

ఫ్లాస్కు కప్పులోని ఐస్ వాటరు ఖాళీచేసి కప్పు అం దించేను. కప్పు బుట్టలో పెట్టటానికి ఆమెమళ్ళీ వంగితే బాగుండును. కాని ఆమె అలా చెయ్యలేదు! కప్పు తన ప్రక్కనే పెట్టుకుంది.

"మీ ఆయన ఏం చేస్తూవుంటారు?" అన్నాను.

"చెప్పమంటావా?" చిలిపిగా అడిగింది.

"చెప్పు!" అన్నాను.

"రోజులో కనీసం పన్నెండు గంటలు నా కళ్ళల్లోకి చూస్తూ కూర్చుంటారు." నవ్వుతూ అంది. నవ్వులో కూడా నన్ను కలవరపెట్టే ఆ చిలిపితనమే!

నాకు మనసులో అరణ్యాలు దహిస్తున్నట్టుంది!

"మిగిలిన సమయంలో...?" రోషంగా అడిగేను.

"మాకు ఏలూరు దగ్గరలో చాలా భూములున్నాయి, వ్యవసాయపు పనులు చూసుకుంటూ కాలంగడుపుతారు"

"పిల్లలెంతమంది?"

"ఒక్కడే బాబు! అయిదేళ్ళు నిండేయి! హైద్రాబాద్‌లో మా మేనకోడలు పెళ్ళిజరిగింది. వారికి రావటం కుదరలేదు! బాబుని ఆయన దగ్గరేవదిలి నేను పెళ్ళి వస్తున్నాను."

"బాబుకి ఏం పేరు పెట్టావ్?"

నాపేరే పెట్టిందేమోనని ఆశ!

"కృష్ణ!" అంది నిశ్చలంగా.

నాకు మనసునిండా ఏదో తృప్తి నిండినట్లయింది.

"మొత్తానికి నాపేరే పెట్టావన్నమాట!" గర్వంగా తృప్తిగా నవ్వుతూ అన్నాను.

"కాదు! ఆపేరు మావారు పెట్టుకున్నారు. ఆయనకు కృష్ణుడంటే ఎంతో ఇష్టం!"

కనీసం నాకీతృప్తి నయినా మిగల్చటం రజనికి ఇష్టం లేదు కాబోలు.

తరువాత కొంతసేపు ఏం మాట్లాడాలో నాకు అర్థం కాలేదు. రజని ఎలా మారిపోయింది? ఎన్ని మాటలు నేర్చింది?

స్త్రీకి బాల్యావస్థలో బొత్తిగా వ్యక్తిత్వంవుండదు. అమాయకత్వం తప్ప ఇంకేం తెలీదనుకుంటాను. అయితే యవ్వనంలో ప్రవేశించి నిర్దుష్టమయిన వ్యక్తిత్వం ఏర్పరుచుకునే వేళలో స్త్రీ ఇంకొకరికి అర్పితమయి పోవటం జరుగుతుంది. అప్పుడు ఆవ్యక్తిత్వం కాస్తా ఆరిందాతనంగా మారిపోతుంది కాబోలు!!

రజనిలో నాకు నిర్దుష్టంగా అలాంటిమార్పే కనిపిస్తోంది. లేక ఈ మార్పుకు కారణం "తనభర్త ధనవంతుడనే అహంకారమా?" మనసు రకరకాలుగా ఆలోచిస్తోంది. అద్దం పూర్తిగా పైకి ఎత్తి తల అవతలకు పెట్టాను.

ఎదురుగా ఒక్క చెట్టయినా కనబడటంలేదు. పల్చని వెన్నెలలో స్నానం చేస్తున్న చిన్నచిన్న పొదలు, డొంకలు మాత్రం తొందరగా వెనక్కు జరిగిపోతున్నాయి. నీలంరంగు ఆకాశంమీద ముత్యాలు తాపడం చేసినట్లు అక్కడక్కడ నక్షత్రాలు మినుకు మినుకు మంటూ కన్నుగీటుతున్నాయి.

దూరాన కన్పిస్తున్న దీపాలకాంతి క్రమేణా దగ్గరవు తోంది. కొద్దినిమిషాల్లోనే రైలు కాజీపేట స్టేషనులో ఆగింది.

"నేను భోజనం ఆర్డరు చేసివస్తాను" అంటూ లేచి బయటకువచ్చాను. కంపార్టుమెంటులోకి, రెండు భోజనాలు తీసుకురమ్మని చెప్పి కేంటీనులో డబ్బు చెల్లించాను. ఇక నా జేబులో పన్నెండు రూపాయలు మాత్రం మిగిలింది. వాల్తేరు వెళ్ళేవరకూ వాటితోనే గడుపుకోవాలి! ఒక సిగి రెట్టుపెట్టె తీసుకొని రెండు కిళ్ళీలు కట్టించాను. నేను కంపార్టు మెంటులోకి వెళ్ళేసరికి అప్పుడే భోజనంవచ్చి సిద్ధంగావుంది. ఇద్దరం భోజనాలు కానిచ్చాం. కేంటీను కుర్రాడు ప్లేటు తీసుకొని వెళ్ళిపోయాడు. ఎదురు సీట్లోని ముగ్గురూ బెర్తులు దింపుకొని నిద్ర కుపక్రమించేరు. రైలు కాజీపేట నుండి బయలుదేరింది.

"నీకు మీ ఆవిడమీద ప్రేమలేదా?" రజని ప్రశ్నకు కళ్ళు చిట్లించిచూశాను. ఆమెసన్నగా నవ్వు తోంది. నోట్లోని కిళ్ళీతో ఆమె బుగ్గలు మరింత గుండ్రంగా తయారయ్యాయి. సుప్రభాత సమయంలో తూర్పు దిక్కున పగిలిన అరుణ వర్ణంలా ఆమె పెదాలు ఎరుపు రంగు పులుముకున్నాయి.

"మొగాడి పెదాలు పండకపోతే భార్యమీద ప్రేమ లేదంటారు" అంది మళ్లీ!

"మీ ఆయన పెదాలు బాగా పండుతాయా!" రజని ధోరణి నాచేత ఇలాటి ప్రశ్నలు వేయిస్తోంది.

"ఆయన అసలు కిళ్ళీ వేసుకోరుగా? అయినా, ఆయన పెదాలు ఎప్పుడూ ఎర్రగానే వుంటాయి" మెల్లగా అంది.

నేనేం జవాబు చెప్పలేదు!

రజని తత్వం నాకు అంతుబట్టకుండా పోతోంది!

'నాకంటె అన్నివిధాలా తనభర్త గొప్పవాడని చెప్పటంకోసమే రజని ఇలా ప్రవర్తిస్తోందా?' ఏమో, మరి!

చివరిసీట్లో వున్న మధ్యవయస్సావిడ ఏదో గొణుగుతోంది. రజని నావైపుకు తిరిగి" ఆవిడకు నిద్రవస్తోంది కాబోలు! పదకొండవుతోందిగా! నువ్వు పై బెర్తుమీదకు వెళ్ళిపో!" అంది!

ఆవులిస్తూ లేచినిలబడ్డాను.

నా బ్యాగుతీసి పై బెర్తుమీద తలవైపున పెట్టాను.

రజని లేచి నిలబడి గొలుసులు వదులుచేసి మధ్య బెర్తుకూడా దింపింది. నేను 'బాత్ రూం'కు వెళ్ళి వచ్చేసరికి క్రిందనున్న ఆవిడ పక్క పరుచుకొని నిద్ర కుపక్రమించింది. రజని తన బెడ్డింగును మధ్య బెర్తుమీద పరుచుకొంది. నేను పై బెర్తుమీదకు ఎక్కేక జ్ఞాపకానికి వచ్చింది.

కనీసం తల క్రింద దిండుగా వాడుకొనేందుకు నా బేగులో దుప్పటీకూడా లేదు! అందులో రెండు జతల బట్టలు, ఒక తువ్వాలు తప్ప ఇంకేమీ లేవు!

రజని తన బెడ్డింగులోంచి 'డన్‌లప్' తలగడాతీసి నాకు అందించింది. మొహమాటంగా అందుకుంటూ

"మరి నీవో!" అన్నాను.

"ఇంకొకటి వుందిలే!" అంది.

తరువాత కిటికీవైపుకువచ్చి నీలం రంగు లైట్లు వెల్గించి పెద్ద బల్బులు ఆర్పేసింది.

దిండు సర్ది మెల్లగా నడుం వాల్చాను.

దిండు కవరుమీద రెండు జంట పక్షులు ముచ్చటగా కబుర్లు చెప్పుకుంటున్నట్లు అందమయిన ఎంబ్రాయిడరీ వుంది. గట్టిగా కళ్ళు మూసుకొని దిండులో ముఖం దూర్చాను. నలిగిపోయిన మల్లెల వాసన, ఉడుకులాం పరిమళం కలిసి ఒక్కసారి నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి.

'రజని ఈ దిండుమీద తలఆన్చి ఎన్ని స్వప్నాలలో తేలిపోయిందో? ఎన్ని కన్నీళ్లు కార్చిందో?'

కళ్లు మూసుకొని నిద్రపోదామనుకున్నా ఏవో ఆలోచనలు వెంట తరుముతున్నాయి. నిద్ర పట్టడం అంత తేలిగ్గాజరిగే విషయంలా కనుపించలేదు.

ఎనిమిది సంవత్సరాల క్రితం-

విజయవాడ కాలేజీలో చదువుతునే రోజుల్లో రజనినే నాజీవిత సర్వస్వంగా భావించేను. మేమిద్దరం గలగలపారే కృష్ణఒడ్డున కూర్చొని ఎన్నో బంగారు కలలు కన్నాం. రంగురంగుల ఊహల్ని భవిష్యత్తుకోసం పేర్చుకుంటూ కాలం గడిపేం!

అయితే, అవన్నీ కలలుగానే మిగిలిపోయాయి!

నా తరువాత పెళ్ళీడుకెదిగిన ముగ్గురు చెల్లెళ్ళువుండే వారు. వారి వివాహాలకు కట్నాలు ఇవ్వటంకోసం నేను ఇరవై వేలకు అమ్ముడుపోవలిసి వచ్చింది. నాచుట్టూ రజని నిర్మించుకున్న ఊహాసౌధాలనూ, ఆశల హర్మ్యాలనూ నిర్దాక్షిణ్యంగా కూల్చివేయ వలసివచ్చింది. పరీక్షలువ్రాసి ఆనాడు విజయవాడ వదిలి వెళ్ళిపోయాక రజనిని ఈ వేళే మళ్ళీ చూడటం!

చెల్లాయిల వివాహాలకు నాకు వచ్చిన కట్నంతోపాటు ఉన్నకాస్త స్తిరాస్తికూడా హరించుకుపోయింది. డిగ్రీ చేత బుచ్చుకొని తిరిగినఊరు తిరక్కుండా అనేక ఉద్యోగాలుచేశాను, కేవలం కుటుంబాన్ని నడపటం కోసం! పోషించలేని పరిస్థితులలో కొన్నిరోజులు నా భార్యనూ, పిల్లల్నీ మామగారింటి దగ్గర వదిలేసిన రోజులుకూడా వున్నాయి.

కొద్ది నెలలుగా నేను హైదరాబాద్‌లో చేస్తున్న టెంపరరీ ఉద్యోగం కాస్తా నెలదినాల క్రితమే ఊడిపోయింది నాభార్యనూ, ఇద్దరు పిల్లల్నీ వాల్తేరులోని మామగారింటికి పంపించేశాను. ఈనెల్లాళ్ళుగా హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూవుంటే జేబులో మిగిలిన ఆఖరి రెండు వందలుకూడా ఆరిపోయాయి. వాల్తేరులో 'రావ్ అండ్ సన్సు'లో 'క్లార్కు' పోస్టు ఖాళీగావుందని మా మామగారు ఉత్తరం రాసేరు. ఒకమిత్రునివద్ద డబ్బు అప్పుతీసుకొని వాల్తేరు బయలుదేరాను.

అయితే- ఈ పరిస్థితి అంతా రజనికి తెలియటం నాకు ఇష్టంలేదు. డబ్బుకోసం ఒకనాడు రజనిని కాదని వేరొకర్ని చేసుకున్నాను. మళ్ళీ ఈనాడు డబ్బువిషయంలో రజనిని నాకంటె ఉన్నత స్థానంలో ఊహించటానికి నా మనసు అంగీకరించటంలేదు. నా ఊహలు చాలా నీచమయినవి కావచ్చు! కాని అహం, ఆత్మగౌరవం నన్ను వెంటాడుతున్నాయి. ఈనాడు నేను నీచంగా బ్రతుకుతున్నట్లు రజనికి తెలియకూడదు. తెలిస్తే నా బ్రతుకే తేలికయిపోతుంది! వీల్లేదు! నా దారిద్ర్యాన్ని బయటపెట్టటానికి నా అంతరాత్మ ససేమిరా ఒప్పుకోలేదు!

ఏనాడూ ఊహించని ఈరకమయిన పరిస్థితి ఎదురయినందులకు మనసు విలవిల్లాడుతోంది. కంటిమీద కునుకు రావటంలేదు!

దిండులోంచి తలఎత్తి మెల్లగా కనులు విప్పాను.

నా క్రింద బెర్తుమీద రజని నిద్రపోతోంది - అతి ప్రశాంతంగా!

తదేకంగా ఆమె వైపుచూశాను.

ఒకటిరెండు ముంగురులు గాలికి ఎగిరి నుదుటిమీద పడికొట్టుకుంటున్నాయి -ఒడ్డున పడిన చేపపిల్లలకు మల్లే! నున్నని బుగ్గలమీద లేత నీలంరంగుకాంతిపడి ప్రతిఫలిస్తోంది. నిశ్చల ధ్యానముద్రలోవున్న ఋషికిమల్లే కను రెప్పలు మెత్తగా మూసుకొని వున్నాయి.

తనను ఎంతో కలవరపెట్టింది ఈనాటి అనుభవం! మనసును కలచివేసింది! అయితే, దీనితో తనకేం సంబంధం లేనట్లు నిద్రపోతోంది రజని! ఆడవాళ్లు ఎంత విచిత్రంగా వుంటారు?

గాజులు గలగలమన్నాయి! నిద్రలోనే ఒక ప్రక్కకు కొద్దిగా ఒత్తిగిలింది రజని! కిటికీలోంచి వీస్తున్న గాలికి ఆమె పట్టుచీరచెంగు ప్రక్కకు చెదిరింది. రజని అందమయిన ఊపిరి నన్ను కలవర పెడుతోంది.

మెల్లగా చేయివంచి ఆమె నుదుటిమీద చూపుడు వేలుతో రాశాను. ఆమెనుదురు మండిపోతున్నట్లుంది!

మెల్లగా కనులు విప్పింది రజని!!

కంగారుగా చేయి వెనక్కు లాక్కున్నాను!

కనులు విప్పిన రజని నవ్వుతోంది, పెదాలు విప్ప కుండానే!

పెదాల మధ్య చిందులువేసిన నవ్వు చిత్రంగా అక్కడే ఇంకిపోతోంది!

గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"కృష్ణా! నిద్రపట్టడంలేదా?" రజని ప్రశ్నలో ఎలాంటి భావమూ లేదు! మాటల్లో నిశ్చలత - మిన్ను విరిగి మీద పడినా చలించని నిశ్చలత!

"ఉహూ!" అన్నాను గోముగా ఆమె వంక చూస్తూ.

"పరుపు లేకుండా నిద్రపోవటం అలవాటు లేదే మిటి?"

నేనేం మాట్లాడలేదు!

"పోనీ. ఇలావచ్చి నా పరుపుమీద నిద్రపో! నేను పైకి వెళ్తాను." మళ్ళీ ఆమే అంది.

"అక్కరలేదు! కాస్త తలనొప్పిగావుంది! అంతే!" అన్నాను అసహనంగా.

రజని ఏమీ మాట్లాడలేదు! మళ్ళీకనులు మూసు కొంది! అర్థంలేని ఆలోచనల మధ్య సుమారు గంటసేపు సతమతమయ్యాక నాకు తెలీకుండానే నిద్రలోకి జారి పోయాను. నాకు తెలివి వచ్చేసరికి బాగా తెల్లారిపోయింది!

పల్చని నీరెండ ప్రకృతిలో పరచుకుంటోంది! బద్ధకంగా ఒళ్ళువిరుచుకుంటూ లేచి క్రిందకు చూశాను. ఎదురుగా అద్దంపెట్టుకొని జుత్తు ముడివేసుకొని పిన్నులు సవరించుకుంటోంది రజని! అప్పుడే స్నానంకూడా చేసినట్లుంది. చిలకాకు పచ్చని పట్టుచీర కట్టుకొంది. అద్దంలో నా ముఖం కనబడినట్లుంది "బాగా నిద్రపట్టిందా?"

పళ్ళమధ్య హెయిర్ పిన్నునొక్కి పట్టుకుంటూ నా వైపు చూడకుండానే అడిగింది.

"ఊఁ!" అన్నాను ఆవులిస్తూ.

"విజయవాడ దాటిపోయింది! నిన్ను లేపుదామనుకున్నాను. కాని నిద్ర పాడుచేయటం ఇష్టం లేకపోయింది. ఫ్లాస్కులో కాఫీ పోయించాను. ముఖం కడుక్కోనిరా!" అంది.

తువ్వాలు భుజంమీద వేసుకొని బాత్‌రూం వైపు నడిచాను.

నేను వచ్చేసరికి బెడ్డింగు తాళ్లు బిగిస్తోంది రజని.

ఫ్లాస్కు కప్పులో కాఫీపోసి ఇచ్చింది. వేడికాఫీ త్రాగేసరికి బద్ధకమంతా వదిలిపోయి నట్లయింది.

రజనికి బెడ్డింగు బిగించటంలో సాయంచేశాను.

"ఇంకో పావు గంటలో ఏలూరు వచ్చేస్తుంది!" మెల్లగా అంది.

వెళ్తున్న రైలును కాని, కదుల్తున్న కాలాన్నిగాని నేను శాసించి ఆపలేను.

"కృష్ణా! ఎప్పుడయినా మా ఇంటికిరా! మీ ఆవిణ్ణి, పిల్లలనూకూడా తీసుకురా!" అంటూ తనభర్త అడ్రసుకార్డు ఒకటి తీసి అందించింది.

'ఎమ్. శ్రీనివాసరావు, లేండులార్డు, రామచంద్ర రావుపేట, ఏలూరు' అనిబంగారు రంగులో అక్షరాలు అందంగా ముద్రించబడి వున్నాయి దానిమీద. కార్డు జేబులో పెట్టుకుంటూ "తప్పకుండా వస్తాను" అన్నాను.

కొద్ది నిమిషాలలోనే రైలు పవర్ పేట స్టేషనులో ఆగింది.

లైసెన్సు కూలీని కేకేసి రజని సామాన్లన్నీ వాడికి అప్పగించేను. "వెళ్ళొస్తాను కృష్ణా!" అంటూ మెల్లగా గేటు వైపుకదిలింది రజని. సమాధానం చెప్పటానికి మాటలు రాక మూగవాడినే అయ్యాను. ఆమె కనుమరగయ్యేంత వరకూ ప్లాట్ ఫారం మీద నిలబడి ఆమెవంకే చూస్తూ వుండిపోయాను.

రైలు కూతవేసి మెల్లగా కదిలింది!

గబగబా కంపార్టుమెంటులోనికి ఎక్కి సీటు వద్దకు చేరుకున్నాను.

రజని ఇంతవరకూ కూర్చున్న సీటు ఖాళీగానే మిగిలి పోయింది, నామనసులాగే!!

ప్రయాణిస్తున్న రైలులో ఎక్కేవారు ఎక్కటం, దిగేవారు దిగటం జరుగుతూనే వుంటుంది. విచిత్రంగా కలిసి వుండటం, ఎవరి గమ్యస్థానాలు రాగానే వాళ్ళు దిగిపోవటం! అంతే!

జీవితంకూడా అలాంటిదే ననుకుంటాను! ఎనిమిదేళ్ళ క్రితం - ఊహాల రైలులో, ఆశలపట్టాలమీద నేనూ, రజనీ కలిసి ప్రయాణించాం. నా స్వార్థానికి రజనిని బలిచేసి నేనే ముందు దిగిపోయాను. గమ్యం తెలియకుండా రజని ముందుకు సాగిపోయింది. అయితే ఈనాడు అయోమయావస్థలో నన్ను వదిలి తానే ముందుగా తన గమ్యంలో దిగిపోయింది.

ఆలోచిస్తున్న కొద్దీ నాఊహలు నాకే చిత్రంగా తోస్తున్నాయి. అయితే నాకు మిగిలిన తృప్తి ఒక్కటే!

ఈనాటి నా పరిస్థితి గురించి రజనికి తెలియలేదు! తెలిస్తే ఆ మెదృష్టిలో నేను ఇంకా చులకనయి పోయివుండేవాణ్ణేమో! అలా జరగనందులకు మాత్రం నన్ను నేనే అభినందించుకున్నాను.

సిగరెట్టు పెట్టెకోసం పై బెర్తుమీదున్న బ్యాగు తీశాను. సైడ్ పాకెట్‌లో చేయిపెట్టేసరికి సిగరెట్టు పేకెట్‌తో బాటు ఏవో కాగితాలు తగిలాయి. బయటకు తీశాను. అందులో ఒకటి - మామయ్య నన్ను వాత్తేరు బయలుదేరి రమ్మని వ్రాసిన ఉత్తరం! రొండోది రోజారంగు కాగితం మడత! ఆత్రంగా దాన్నివిప్పాను. దానిలోంచి

రెండువందల రూపాయల కాగితాలు క్రిందపడ్డాయి! ఆశ్చ ర్యంగా వాటినితీసి రోజారంగు కాగితం మడత విప్పాను.

అది రజని వ్రాసిన ఉత్తరం!

సీట్లో కూలబడి చదివాను!

"కృష్ణా! - ఈ జీవితాలు ఎంత చిత్రమయినవి!

కలుసుకోవడం, విడిపోవడం, ఈ రెండింటి మధ్యా తీయని అనుభూతులు-మిగిలేది జ్ఞాపకాలనీడలు మాత్రమే!

ఎనిమిదేళ్ళ క్రితం, జీవితంలో మనం కల్సుకున్నాం.

ఎన్నోకలలు కన్నాం! భవిష్యత్తుకోసం బంగారు మేడలు నిర్మించుకున్నాం - ఊహల్లోనే।

కాని నువ్వు నన్నుమోసం చేశావు! కాదు! నిన్ను నువ్వు మోసగించుకున్నావు.

అయితే అప్పుడు నేను నీకోసం బెంగెట్టుకోలేదు! విరహగీతాలు పాడుకోలేదు! మనుష్యుల నైజాలు అర్థం చేసుకున్నాను, లోకం అంటే ఏమిటో తెల్సుకున్నాను.

నేను ప్రేమించే వ్యక్తికాదు నాక్కావల్సింది।

నన్ను ప్రేమించేవ్యక్తి కావాలని అర్థం చేసు కున్నాను. అందుకే నన్ను మనసా ఆరాధించే మనిషిని - శ్రీనివాసరావుగార్ని పెళ్ళి చేసుకన్నాను.

నా జీవితం చాలా సుఖంగా గడిచిపోతోంది.

అయితే మళ్ళీ ఎనిమిదేళ్ళ తరువాత ఈ నాడు రైలులో కలిశాం. నిన్ను మళ్ళీ కల్సుకున్నందులకు చాలా ఆనందించాను.

మంచి జీతం తెచ్చుకుంటూ హోదాలో వున్నట్లు నువ్వు చెప్పినపుడు ఎంతో సంబర పడ్డాను.

కాని నా ఆనందం కేవలం కొద్దిగంటలు మాత్రమే మిగిలింది. ఉదయం నేను లేచేసరికి నీ బేగ్ పైనుండి జారి క్రింద పడివుంది. సైడ్ పాకెట్ లోంచి ఒక ఉత్తరం తొంగి చూస్తోంది. పరుల . ఉత్తరాలు చదవకూడదన్న విషయం నాకు తెలుసు! కాని-నువ్వు నాకు పరాయివాడివెలా అవుతావు? కుతూహలం చంపుకోలేక ఆ ఉత్తరంతీసి చదివేను. అది మీ మామగారు నీకురాసిన ఉత్తరం! నీ పరిస్థితి అంతా నాకు అర్థమయింది. ఇంకా నిన్ను నువ్వు మోసగించుకుంటూనే బ్రతుకు తున్నావన్న మాట!

కృష్ణా! ఎనిమిదేళ్ళక్రితం ఆత్మవంచన చేసుకొని ఒక ఆత్మీయురాలిని పోగొట్టుకున్నావు. ఆనాటి పరిస్థితే అందుకు కారణమని నాకునేనే సర్ది చెప్పుకున్నాను. ఈనాడు అదే వంచనతో ఇంకో స్నేహితురాలినికూడా పోగొట్టుకోకు! నేను నీకు సాయంచేయలేని దాన్నికావొచ్చు! కాని సాను భూతినయినా చూపించగలను!

నిన్నరాత్రి నా మాటలతో నిన్ను బాధించివుంటే క్షమించు! ఏలూరులో మా ఆయనకు మంచి పలుకుబడి

వుంది. ఆయన ప్రయత్నిస్తే నువ్వు సులువుగా బ్రతకటానికి తగ్గ ఉద్యోగం చూపించగలరు! త్వరలోనే ఆ ప్రయత్నం చేయించి మీ మామగారిపేర నీకు ఉత్తరం రాయిస్తాను! తప్పకుండారా!

ఈ ఉత్తరంతో బాటు రెండువందలు పంపుతున్నాను. నీకు చిలకాకుపచ్చ రంగుపట్టు చీరలంటే ఇష్టం కదూ! మీ ఆవిడకు ఒకచీర కొని నా కానుకగా ఇయ్యి. తప్పుగా అర్థం చేసుకోకు! వుంటాను, మరి-

స్నేహితురాలు,

రజని.

[ఆంధ్రప్రభ]

*   *   *   *